హైదరాబాద్ వార్త

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజావాణి లో ప్రజలు అందచేసిన అర్జీలను పరిశీలించి సత్వ రమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి తో కలసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం 1411 దర ఖాస్తులు అందచేశారని తెలిపారు. అర్జీలను సత్వ రమే పరిష్కారం చేయాలని సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 1411 దరఖాస్తులు అందగా అత్య ధికంగా గృహ నిర్మాణ శాఖకు 1052, రేషన్ కార్డుల కోసం 271, పెన్షన్ 47, డిఈఓ 03, ఎస్సీ కార్పొరేషన్ 04, రెవెన్యూ 11, ఐసిడీఎస్ 4, ఇతర శాఖలకు సంబంధించినవి 19 దరఖా స్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డిఆర్వో వెంకటచారి, ఆర్డీఓలు రామకృష్ణ,సాయిరాం జిల్లా అధికారులు జి.ఆశన్న, ఆర్.రోహిణి, పవన్‌కుమార్, కోటాజీ, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ పాల్గొన్నారు.

ఆర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించడంపై దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగరం లోని వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ఫిర్యాదులను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో ఆయా విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా అందుతు న్నందున వాటి పరిష్కారంపై సంబంధిత అధి కారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. టౌన్‌ప్లానింగ్ సంబంధిచి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సమస్య పరిష్కరించగలిగినదైతే వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించ లేనట్లైతే అందుకు గల కారణాలను ఆర్జీదారులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, సుభద్రదేవి, నళినిపద్మావతి, పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, అశోక్ సామ్రాట్, రఘుప్రసాద్, యాదగిరిరావు, అలివేలు మంగ తాయారు, సిసిపి శ్రీనివాస్, సి.ఇ కోటేశ్వరరావు, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, అడిషనల్ సి.సి.పి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సార్ మాకు ఇళ్లు ఇవ్వరా..?

ఇందిరమ్మ ఇండ్లు, డబుల్‌బెడ్‌రూం కోసం పేదల ఆరాటం

ఎమ్మెల్యేలు,ఇతర ప్రజాప్రతినిధుల చుట్టూ నిత్యం చక్కర్లు

ప్రజావాణిలోనూ ప్రతివారం వెయ్యికిపైగా దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం పేదలు కొండంత ఆశతో ఎదురు చూస్తు న్నారు.ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రజాప్రతి నిధులకు వారి కి ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 1411 దరఖాస్తులు వస్తే అందులో గృహనిర్మాణశాఖకు 1052దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లు కావాలని కొందరు, డబుల్ బెడ్‌రూం కేటాయించాలని మరి కొందరు ఇలా కలెక్టరేట్‌కు క్యూకట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాద్లో అర్హులైన పేద లకు లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తా మని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలోని పలు లొకేషన్ల లో ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టింది. కొన్ని చోట్ల నిర్మా ణం పూర్తి చేసుకోగా పేదలకు పంపిణీ చేశారు. ఇంకా చాలా చోట్ల నిర్మాణం పూర్తి కాగా పంపిణీ చేయకుండా నిలిపివేశారు మరికొన్ని చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ఇండ్లలో తమకు అవకాశం దక్కుతుందో? లేదో అని పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు.ఈనేపథ్యంలో రెండు నెలల క్రితమే రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్మాణం పూర్తి చేసుకున్న ఇండ్లను అర్హులైన పేదలకు అందిస్తా మని కలెక్టర్ చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి చైర్మన్ గా, కలెక్టర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారని చెప్పారు. దీంతో కొద్దిరోజులుగా కలెక్టరేట్ చుట్టూ పేదలు సొంతింటి కోసం దరఖాస్తులు పట్టుకుని కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

ఎలాగైనా ఇప్పించండి...

ఓవైపు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తూనే మరోవైపు ఎమ్మెల్యేలు, ఎంపి, మంత్రి ఇలా ప్రజా ప్రతినిధుల ఇండ్ల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో గ్రేటర్ ఎమ్మెల్యేలు తమ కార్యాలయంలో ఉన్నా, బస్తీలకు వెళ్లినా వీటి గురించే ప్రజలు అడుగు తుండడంతో వారికి నచ్చచెప్పలేక తలలు పట్టు కుంటున్నారు. కొంతమంది తమకు ఉన్న పలుకు బడిని ఉపయోగించి ఇతర ప్రజాప్రతి నిధులతో సిఫారసు లెటర్లు తీసుకొస్తున్నారు. పక్క నియో జకవర్గం ఎమ్మెల్యే తమకు బాగా తెలుసని కొంత మంది, బందువు అని మరికొంత మంది ఇండ్ల కోసం తంటాలుపడుతున్నారు.దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఎమ్మెల్యేలు డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం వచ్చేవారి అనుమానాలను నివృత్తి చేస్తూ త్వరలో అందుతాయనిచ్చజెప్పి పంపిస్తున్నారు. అలాగే మూసీ సుందరీకరణలో భాగంగా రివర్ బెడ్‌లో నివాసముంటూ ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని ప్రకటించింది.ఇప్పటికే కొంతమంది ఆయా ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి వచ్చి చేరారు. దీంతో ఇప్పటికే కట్టిన ఇండ్ల పంపిణీ పూర్తయితే మళ్లీ కొత్తగా కట్టేది ఎప్పుడు ? తమకు వచ్చేది ఎప్పుడనే అనుమానాల మధ్య పేదలు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రజావాణిలో వినతులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

శేరిలింగంపల్లి, జనవరి 27 ప్రభాతవార్త ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని శేరిలిం గంపల్లి వెస్ట్‌జోన్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధి కారులకు ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జోనల్ కమిషనర్ కార్యాలయం లో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, యూబీడీ, వెటర్నరి,శానిటేషన్ విభాగాల అధికారు లతో కలిసి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రజా వాణిలో అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జోనల్ కార్యాలయం లో పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులు రాగా జోన్ వ్యాప్తంగా పలు విభాగాలకు సంబం ధించి మొత్తం 17 వినతులు అందాయి. అందులో కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు. ఈ సంద ర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లా డుతూ.. ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు ప్రజావాణి అత్యంత కీలక మైన వేదికన్నారు. ప్రజావాణి సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటి పరిష్కారంలో ఎటువంటి నిర్ల క్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు, ప్రతి వినతిని విధిగా సర్కిళ్లలో రికార్డులలో నమోదు చేయా లని, నిర్ధిష్ట సమయంలో పరిష్కరించి ప్రజలకు సమాచారం అందించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. ప్రతి సోమవారం సర్కిళ్లలో డీసీ సహా ఆయా విభాగాల అధికారులు విధిగా ప్రజావాణిలో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఈఈ మల్లిఖార్జున్, డీఈ శ్రీనివాస్, విల్సన్, సిటి ప్లానర్ శ్యామ్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుంటున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

అన్నివర్గాలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కృషి

మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జనవరి 27 ప్రభాతవార్త గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్య క్షుడు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ నాయకత్వం లో రాష్ట్ర కమిటీ ప్రతినిధుల బృందం సోమవారం రవీంద్రభారతిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 2.25లక్షల మంది గౌడ వృత్తిదారులు కల్లుగీత వృత్తి మీద ఆధారపడి బ్రకుతున్నారని ఈ వృత్తిలో నిత్యం ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే అందరికీ కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) పంపిణీ చేయాలని, వృత్తిలో మరణించిన, అంగవైకల్యం పొందిన కుటుంబాలకు ఇప్పటికే 8 కోట్ల రూపాయల ఎక్స్ గ్రేషియా పెండింగ్‌లో ఉన్నదని వెంటనే నిధులు విడుదల చేసి వృత్తివేసే కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 5 లక్షలు ఉన్న ఎక్స్‌గ్రేషియోను 10 లక్షల వరకు పెంచుతామని హామీ ఇచ్చి మేనిఫెస్టోలో చేర్చారని, దానిని అమలు జరిగేలా జీవో జారీ చేయాలని, నూతన గ్రామ పంచాయితీలలో గౌడ సొసైటీలు ఇవ్వాలని మంత్రిని కోరడం జరిగిందని యెలికట్టె విజయ్ కుమార్‌గౌడ్ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి పెండింగ్ ఎక్స్‌గ్రేషియాలు విడుదల చేయడానికి ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్కతో మాట్లాడి కేటాయి స్తామని హామీ ఇచ్చారు.వృత్తి చేసే వారందరికీ సేఫ్టీకిట్స్ రక్షణ కవచం పంపిణీ చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గా లకు న్యాయం చేసే దానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని జూపల్లి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దుర్గాగౌడ్, మూల వెంకటేశ్వర్లు గౌడ్, ఆంజనేయులుగౌడ్, బిక్కి బుచ్చన్న గౌడ్, చిత్తలూరు నారాయణగౌడ్, పూధరీ రాజు గౌడ్, దేవేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్ అగ్ని ప్రమాద ఘటన.. యువకుడు మిస్సింగ్

రెండు రెస్క్యూ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: ట్యాంక్‌బండ్‌లో యువకుడు మిస్సింగ్.. హుస్సేన్ సాగర్‌లో బోట్లు కాలిపోయాక ఏం జరి గింది? ట్యాంక్‌బండ్‌లో యువకుడు మిస్సింగ్ ఇప్పుడు కలకలం రేపింది. భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద ఆదివారం నిర్వహించిన భారతమాత మహాహారతి వేడుకల్లో రెండు బోట్లు కాలిపోయిన సంగతి తెలి సిందే. ఈ ఘటన తర్వాత నాగారం నివాసి అజయ్(21) అదృశ్యమయ్యాడు. ఈమేరకు సోమ వారం ఉదయం హుస్సేన్‌సాగర్ వద్దకు కుటుంబ సభ్యులు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. అజయ్‌తోపాటు వెళ్లిన స్నేహితులు సరక్షితంగా ఇంటికి వచ్చారని తెలి పారు. దీంతో పోలీసులు అజయ్ కోసం రెండు రెస్క్యూ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. మరికొన్ని బృందాలను రప్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. హుస్సేన్‌సాగర్‌లో ఆదివారం భారత మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాతకు మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. దీన్ని తిలకిం చేందుకు అజయ్ స్నేహితులతో వచ్చాడు. బాణ సంచాను కాల్చేందుకు పర్యాటక శాఖకు చెందిన రెండు బోట్లలో సామగ్రితో వెళ్లారు. కాగా, ఒక్క సారిగా బాణాసంచా పేలుస్తుండగా మంటలు అంటుకొని రెండు బోట్లు దగ్ధమయ్యాయి. అప్పటి నుంచి అజయ్ కనిపించడం లేదు. ఈ విషయం తెలియగానే అజయ్ కోసం వాళ్ల కుటుంబ సభ్యులు కాల్‌చేశారు. కానీ అతని ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో ఆస్పత్రిలో ఉన్నాడేమో అని వెళ్లి చూడగా.. ఏ ఆస్పత్రిలోనూ అజయ్ ఆచూకీ కనిపించలేదు. దీంతో అజయ్ కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.అజయ్‌కు ఈత రాదని కుటుంబసభ్యులు చెప్పడంతో హుస్సేన్ సాగర్‌లో మునిగిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో రెండు బృందాలతో ఈ ఉదయం నుంచి అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, తన బిడ్డ చాలా ధైర్యవంతుడు అని.. తన బిడ్డ తనకు కావాలని అజయ్ తల్లి కన్నీళ్లు పెట్టుకుంటుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

అజయ్

గాయపడిన ఐదుగురు వ్యక్తులు...

హుస్సేన్‌సాగర్‌లో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో ఐదుగురు నీటిలోకి దూకి ప్రాణాలను రక్షించుకున్నారు. వీరిలో బాణాసంచా కాలుస్తున్న గణపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గణపతి శరీరానికి 100 శాతం కాలిన గాయాలై స్పృహ తప్పిపోవ డంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చింతల కృష్ణ, సాయిచంద్‌కు స్వల్పంగా కాలిన గాయాలు కాగా, ఈ ప్రమాదంలో బోటు డ్రైవర్ పల్లె ప్రణీత్ (32), దుబ్బాసి సునీల్ (38)కు చేతులు, కాళ్లకు మంటలు అంటుకొని స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఘటనలో బాణాసంచా ఉన్న పడవతో పాటు దానితో పాటు ఉన్న మరో పడవ పూర్తిగా కాలిపోయాయి. రెండు అగ్నిమాపక శకటాలతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ప్రమాదం ఎలా జరిగింది..?

బోట్లు నీటిలో కొద్దిదూరం ఉండటంతో అగ్ని మాపక సిబ్బంది అప్పటికప్పుడు ప్రత్యేకంగా తెప్పించిన రెండు బోట్లతో మంటలు ఆర్పే యత్నం చేశాయి. మంటలు ఆర్పడానికి దాదాపు రెండున్నర గంటలకుపైగా శ్రమించాల్సి వచ్చింది. అయితే ప్రమాదం జరగడానికి కొద్ది సేపు ముందే గవర్నర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ భారీ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం ఎలా జరిగి ఉంటుందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

హుస్సేన్‌సాగర్ ప్రమాద బాధితులకు 'యశోదా'లో చికిత్స

కంటోన్మెంట్, జనవరి 27 ప్రభాతవార్త : హుస్సేన్‌సాగర్‌లో బోట్లు తగలబడిన ఘటన లో యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆది వారం ముగ్గురు వ్యక్తులు డిశ్చార్జీ కాగా సోమ వారం మరోవ్యక్తి డిశ్చార్జీ అయ్యాడు. ముందుగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స జరిపిన అనంతరం కొద్దిసేపటికే వారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సునీల్ ((35) 7 శాతం, ప్రణీత్‌కుమార్ (32) 14 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారు. కాగా గణపతి వందశాతం కాలినట్లు సమాచారం.

గాయపడినవారికి మెరుగైన చికిత్స అందిస్తాం

భారతమాత ఫౌండేషన్ కార్యదర్శి వికాస్‌కుమార్

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త ప్రతి ఏడాదిమాదిరిగానే ఈఏడాదీ భారతమాత మహా హారతి కార్యక్రమం ప్రజల కరతాళధ్వనుల మధ్య విజయవంతంగా నిర్వహించామని భారత మాత ఫౌండేషన్ కార్యాలయ కార్యదర్శి వికాస్ కుమార్ పేర్కొన్నారు. అయితే కార్యక్రమం చివర్లో నిర్వహించే క్రాకర్‌షోలో ప్రమాదం చోటుచేసు కోవడం దురదృష్టకరమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు, ఒకరికి తీవ్రగాయాలు కావడాన్ని చింతి స్తున్నామని, గాయపడినవారందరికీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరుగైన చికిత్స అందించబడుతోందని తెలిపారు. బాధితులకు, వారి కుటుంబ సభ్యు లకు భారతమాత ఫౌండేషన్ అండగా ఉంటుంది. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని భగవం తుడిని కోరుకుంటున్నాని పేర్కొన్నారు. భారత మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లుగా ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న భాగ్యనగరంలో భారతమాత మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థులు, యువతలో దేశభక్తిని రేకెత్తించే ఈకార్యక్రమం ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటూ ఒక ఆనవాయితీగా మారిందని తెలి పారు. ఈ ఏడాది రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 వసంతాలు పూర్తయినసందర్భంగా ఈ మహా హారతి కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించా లని భారతమాత ఫౌండేషన్ తలపెట్టిందని తెలి పారు. ఈ నేపథ్యంలో ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థకు ఈ కార్యక్రమం నిర్వహణ బాధ్యతను అప్పజెప్పడం జరిగిందని వివరించారు. రాజ మహేంద్రవరం (రాజమండ్రి)కి చెందిన బి క్రాకర్స్ అనే సంస్థ భారత రాజ్యాంగం 75వ వార్షికో త్సవం, భారతదేశం మ్యాప్, జాతీయ త్రివర్ణ పతాకాన్ని క్రాకర్ షో ద్వారా ఆవిష్కరిస్తామని ప్రతిపాదించిందని తెలిపారు. ఈ సంస్థకు క్రాకర్ షో నిర్వహణలో 100 సంవత్సరాల అనుభవం ఉందని, ఇటీవల జనవరి 24న ఎల్బీ స్టేడియం లో జరిగిన కార్యక్రమంలోనూ క్రాకర్ షోను విజయవంతంగా నిర్వహించిందని పేర్కొన్నారు. 100 ఏళ్ల పురాతన ఈ సంస్థకు క్రాకర్ షో నిర్వ హణలో ఉన్న ఘనమైన రికార్డును పరిగణనలోకి తీసుకొని క్రాకర్ షో ప్రతిపాదనలకు భారతమాత ఫౌండేషన్ ఆమోదం తెలిపిందని వికాస్‌కుమార్ వివరణ ఇచ్చారు.

టీం ఇండియా మేనేజర్‌గా దేవరాజ్‌ను నియమించడం హర్షణీయం

-మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ ఆర్.దేవరజ్ వచ్చే ఛాంపియన్ ట్రోఫీ కి టీం ఇండియా మేనేజర్‌గా నియమించడం హర్షణీయమని హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. ఇటీవల మేనేజర్‌గా నియమితులైన దేవరాజ్ సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మీని ఆమె క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా దేవరాజ్‌ను ఆమె శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మరిన్ని అవకాశాలు అందిపుచ్చుని మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

దేవరాజ్‌ను సన్మానిస్తున్న మేయర్‌గద్వాల్ విజయలక్ష్మీ తదితరులు

అద్వితీయం అద్భుతం విద్యానందిని భరతనాట్యం

రవీంద్రభారతి, జనవరి 27 ప్రభాతవార్త : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరామ నాటక నికేతన్ ప్రముఖ నాట్యగురువు విఎస్.రామ మూర్తి, మంజుల రామస్వామిల శిష్య రాలు జి.ఎస్.విద్యానందిని భరతనాట్య ఆరంగేట్రం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అద్వితీయం అద్భుతం రస రమ్యంగా సాగింది. విద్యానందిని ఇప్ప టికే పలు జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శనలు కావించడంతో పాటు 75వ గణతంత్ర దినోత్సవం,స్వాతంత్ర్య వేడుక ల్లో న్యూఢిల్లీ రాష్ట్రపతి ద్రౌపతిముర్ము, ప్రధాని నరేంద్రమోడి సమక్షంలో ప్రదర్శనలు చేసి వారి శుభాశీస్సులందుకుంది. విద్యానందిని ముందుగా తన భరత నాట్య ఆరంగేట్రంను పుష్పాంజలి, గణపతిస్తుతితో ప్రారంభించి అనంతరం జతిస్వరం, శబ్దం, స్వరజతి, కీర్తన, తిల్లానా అంశాలను శృతి లయబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శిస్తూ మంగళంతో నాట్యవిన్యా సాన్ని ముగించి ఆశేష ప్రేక్షకుల మన్ననలు ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సంధ్యారాజు, దైవజ్ఞశర్మ, డా. రాధాశ్రీ, న్యాయవాది నూతి శ్రీకరశర్మ, కిష్టయ్యగుప్తా, శ్రీనివాస్‌గుప్తా తదితరులు విచ్చేసి కళాకారిణి విద్యానందిని ఎంతగానో అభినందించి గొప్ప కళాకారిణిగా ప్రఖ్యాతిగాంచాలని ఆకాంక్షించారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కష్టపడతా

- నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల ప్రత్యేకాధికారి శ్రీధర్

నార్సింగి, జనవరి 27 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపాలిటీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కష్టపడతానని ప్రత్యేకాధికారి పి.శ్రీధర్ పేర్కొ న్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ కార్పొ రేషన్‌కు వచ్చిన శ్రీధర్‌కు కమిషనర్ శరత్‌చంద్ర, ఆయన బృందం సభ్యులు పుష్పగుచ్ఛాలిచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం కార్పొరేషన్ హాల్ లో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకాధికారి శ్రీధర్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బంది అందరిని పరిచయంచేసుకున్నారు. ఎన్ని వార్డులు ఉన్నాయి? ఆయా వార్డుల అధికారులు ఎవరూ? పారిశుధ్య నిర్వహణ ఇంచార్జి ఎవరూ? ఆస్థి పన్నుల వసూలు ఎంత వరకు వచ్చింది? ప్రారంభించిన అభివృద్ధి పనులు ఏ మేరకు జరుగుతున్నాయి? వన మహోత్సవం నిర్వాహణ ఎలా జరుగుతుంది? ఆదాయం ఎంత? జీత భత్యాల ఖర్చుఎంత? కోర్టు కేసులు ఎన్ని? భవన నిర్మాణాల అనుమతులు,ఆక్యుపెన్సీలు ఎలా జరు గుతున్నాయి? ఆడిట్‌అభ్యంతరాలు ఏమున్నాయి? బ్యాంక్ లింక్, ఇందరిఆ మహిళా శక్తి పతకాలు, లక్ష్యాలు ఏమున్నాయి? అని అన్ని శాఖల అధికా రుల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు ఎలా పని చేశారో కానీ, ఇప్పటి నుంచి అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేయాల్సిందేనని, లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని ఏ వార్డులో కూడా చెత్త నిలువ ఉండకుండా సంబంధిత శాఖ అధికారులు విధులు నిర్వాహించాలన్నారు. మంచినీరు, విద్యుత్ సరఫరాలలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వేగం గా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా, జవాబుదారి తనంతో విధులు నిర్వ హించాలని ప్రత్యేక అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. ప్రత్యేక అధికారి తొలి సమావేశంలోనే అన్ని శాఖల అధికారుల పనితీరుపై ఆరా తీసి, సుతి మెత్తగా హెచ్చరిక జారీ చేయడంతో అధికారులు, సిబ్బంది అంతా అప్రత్తంగా విధులు నిర్వహిం చాలని చర్చించుకున్నారు.



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శ్రీధర్‌కు పుష్పగుచ్ఛాలిచ్చి ఆహ్వానిస్తున్న కమిషనర్

బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారంచేస్తున్న ఆనంద్‌బాబు

బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధికి పాటుపడతా : ఎమ్మెల్యే

కంటోన్మెంట్, జనవరి 27 ప్రభాతవార్త: బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధికి సభ్యులు పాటుపడాలని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. సోమవారం బోయిన్‌పల్లి యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముందుగా మార్కెట్ ప్రధాన గేట్ ద్వారం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెలే య శ్రీగణేష్ సమక్షంలో నూతన కమిటీని మార్కెట్ యార్డు కార్యదర్శి వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించారు.మార్కెట్ చైర్మన్ ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్‌గా డి.బి.దేవేందర్ (దేవుడు)తోపాటు మరో 12 మంది సభ్యులుగా, నలుగురు ఎక్స్ అఫిసియో సభ్యులుగా ఉండగా,మొత్తం 18 మందితో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకారం ఎలాంటి హంగు అర్భాటాలు లేకుండా సాదాసీదాగా జరిగింది. సభ్యులుగా ససాయి శరత్, డి. సంతోష్‌కుమార్, సంతూ, రామన్, బి.క్రిష్ణారెడ్డి, కె.దుర్గేశ్ గౌడ్, సి.అకాశ్ రెడ్డి, అంజద్ పాషా, ఎన్.రాజేందర్, ఎండి.అస్లమ్, గౌతమ్, ఎస్. ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే : ఎమ్మెల్యే తలసాని

అడ్డగుట్ట, జనవరి 27 ప్రభాతవార్త: క్రీడాకారులు గెలుపు,ఓటములను సమానంగా స్వీకరించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.ఆదివారం రాత్రి మోండా డివిజన్‌లోని ఆదయ్య నగర్‌లో ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్స్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడంవల్ల మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. అనంతరం విజేతలకు తలసాని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దినేశ్, విజయానంద్, అఖిలేశ్, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సౌందర్య

అడ్డగుట్ట, జనవరి 27 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని బిజెపి డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య సోమవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు జి.హంసరాజ్, గెల్లు ఉదయ్‌యాదవ్, శివలింగంచారి, వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌కు సన్మానం



మార్కెట్ వైస్ చైర్మన్ దేవుడును సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కంటోన్మెంట్, జనవరి 27 ప్రభాతవార్త: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు నూతన వైస్‌చైర్మన్‌గా డి.బి.దేవేందర్(దేవుడు)కు అవకాశం కల్పించినందుకు కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నేత ఇటుక శ్రీకిషన్‌మాదిగ హర్షం వ్యక్తం చేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన దేవుడుకు వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దేవుడుకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజిత్ కళ్యాణ్, నవీన్,దుబ్బ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా : రామక్రిష్ణ

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్, జనవరి 27 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు మీ కష్టాల్లో తోడు ఉంటానని నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. సోమవారం 6వ వార్డులోని సీతారాంపూర్, శ్రీనివాస్‌కాలనీ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. బస్తీల్లో డ్రైనేజీ, వరదనీరు, రామన్న కుంట చెరువులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఆయన దృష్టి కి తెచ్చారు. తన దృష్టి కి తెచ్చిన సమస్యలను త్వరిత గతిని పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రతీక్ జైన్, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి

సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలోని మహేశ్వరం నియోజకవర్గంలోనున్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఓ)లోని సిఎం ప్రత్యేక కార్యదర్శికి పిఎస్‌గా పని చేస్తున్న పి.శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడి కార్పొరేషన్ పాలకవర్గం పదవీ కాలం 26వ తేదీ నాటికి ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం స్పెషలాఫీసర్‌ను నియమించింది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

మీర్‌పేట్ కార్పొరేషన్ స్పెషలాఫీసర్‌గా ప్రతిమాసింగ్

సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరానికి ఆనుకొని ఉన్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ నియమితులయ్యారు. ఈ కార్పొరేషన్ పాలకవర్గం పదవీ కాలం గణతంత్ర దినోత్సవం రోజే ముగిసినందున ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థల) ప్రతిమాసింగ్ స్పెషలాఫీసర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఈ మేరకు ఆమె మీర్‌పేట్ కార్పొరేషన్‌కు ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తూ ఇక్కడి బాధ్యతలు చూస్తారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, జనవరి 26 ప్రభాతవార్త : ఫుట్‌పాత్ వ్యాపారమే వారి జీవనాధారమని, వారిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులకు సూచించారు. సోమవారం పద్మారావునగర్‌లో ఫుట్‌పాత్ వ్యాపారులు, పార్క్ అభివృద్ధి కమిటీ, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని వివరించారు. స్పష్టమైన మార్గదర్శకాలు చేసి వాటి ప్రకారం వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు కాలనీల ప్రజలు మాట్లాడుతూ రోడ్లపై ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమ కాలనీలలోకి వెళ్లే రోడ్లను సైతం ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా కాలనీలలో

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

వాహనాలను సైతం అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్న కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. స్పందించిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఫుట్‌పాత్ వ్యాపారులకు త్వరలో ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందని, ట్రాఫిక్ పోలీసు అధికారులు నిర్దేశించిన ప్రాంతాలలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఆదేశించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్పొరేటర్ హేమలత, డీఎంసీ సమ్మయ్య, ట్రాఫిక్ శ్రీనివాస్, వాటర్‌వర్క్స్ వినోద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, చక్రధర్‌యాదవ్, పుష్పంత్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అంబులెన్స్ సురేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావలి

కేసులు సత్వర పరిష్కారానికి న్యాయవాదుల పాత్ర కీలకం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావలి

చిక్కడపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: రాష్ట్ర హైకోర్టులో కేసులు త్వరగా పరిష్కరించే అంశంలో న్యాయవాదుల పాత్ర కీలకమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావలి అన్నారు. కోర్టులో స్టెనోగ్రాఫర్ల సంఖ్యను పెంచేందుకు సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని, దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుల త్యాగాలను ఎవరూ కూడా మరువద్దని, వారు చూపిన బాటలో ముందుకు సాగాలన్నారు. బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్ట్స్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.రఘు రామ్‌రెడ్డి, మధుసూదన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు జస్టిస్ అభినందన్ కె.షావలీ హాజరై జాతీయ పతాకాన్ని ఆదివారం ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో లేబర్‌కోర్టు ప్రిసైడింగ్ ఆఫీసర్ జివిఎన్.భరతలక్ష్మి, పారిశ్రామిక ట్రిబ్యునల్ చైర్మన్ కోకా రాధాదేవి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.తిరుపతిరెడ్డి, కిరణ్‌కుమార్ యాదవ్, సం యుక్త కార్యదర్శి ఎఎస్.రవియా బేగం, లైబ్రరీ కార్యదర్శి ఎం.సుబ్ర హ్మణ్యశాస్త్రి, కోశాధికారి బి.కిరణ్‌కుమార్, కార్యవర్గసభ్యులు డి.విలాస్, రమేశ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య అభ్యాసకులకు ఉపయుక్తం నాట్యశాస్త్ర పుస్తకం

నాట్యశాస్త్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, భట్టాచార్య,ఆనంద్, రమాదేవి

నాంపల్లి, జనవరి 27 ప్రభాతవార్త : కూచిపూడి నాట్యగురువు రమాదేవి రాసి నాట్యశాస్త్ర పుస్తకం భారతీయ శాస్త్రీయ నృత్యాలు అభ్యసించేవారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది సులువుగా అర్థమవుతుందని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుగ్రహీత పి.ఎల్.భట్టాచార్య అన్నారు. రవీంద్రభారతి లోని సమావేశ మందిరంలో ప్రముఖులు తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, కూచిబొట్ల ఆనంద్, భాగవతుల సేతు రాం, డా. రమాదేవి, శ్వేతప్రసాద్ తదితరులతో కలిసి నాట్యశాస్త్ర పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత్రిని ఎంతగానో అభినందించారు. నాట్యశాస్త్ర సంక్షిప్తంగా తయారుచేసి ఆంగ్లంలోకి అనువదించి అందించాలని కూచిబొట్ల ఆనంద్ అన్నారు. ఈ పుస్తకం సర్టిఫికెట్‌లో ఉండి డిప్లమా, డిప్లమా నుండి డిగ్రీ, డిగ్రీ నుండి మాస్టర్స్‌కి తీసుకుపోయే శక్తిసామర్థ్యాలు పుష్కలంగా ఉన్నటువంటి వ్యక్తి రమాదేవి అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా అతిథులంతా కలిసి రచయిత్రి నాట్యగురు రమాదేవిని ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి : డిఈ

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 27 ప్రభాతవార్త : విధి నిర్వాహణలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాజేంద్రనగర్‌డివిజనల్ ఇంజనీరు రత్నాకర్ రావు అన్నారు. శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో డిఈ రత్నాకర్ రావుకు విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం రాజేంద్రనగర్ డివిజన్ అసోసియేషన్ ప్రతినిధులు కలసి నూతన సంవత్సరం 2025 డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు ఏ.శ్రీహరి రావు,ప్రధాన కార్యదర్శి ఎంఎ అజీమ్,వర్కింగ్ ప్రెశిడెంట్ డి.శ్రీనివాస్,అదనపు కార్యదర్శి రమణ, కోశాధికారి వి.వరప్రసాద్,సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రతినిధి బాబూరావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర రావు, మణిరాం, యాదయ్య, వి.రాజారాం,జెఎఓ బి.శ్యామ్ సుందర్ సింగ్, సీనియర్ అసిస్టెంట్ మల్లేషం, పద్మనాభం, మహేందర్, చందు పాల్గొన్నారు.

డిఈ రత్నాకర్‌రావుకు కొత్త డైరీని అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌తో సమావేశమైన కార్పొరేటర్

కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

-జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్న సందర్భంగా జోనల్ కమిషనర్‌ను స్థానిక కార్పొరేటర్ పావనీ వినయకుమార్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ జవహర్ నగర్ వ్యాయామశాల, ఆటస్థలము మరియు కళ్యాణ మండప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్, కమిటీ సభ్యులు మహేందర్, కృష్ణ, షరీఫ్ తదితర సభ్యులతో కలిశారు. జవహర్ నగర్ కమ్యూనిటీ హాలు అభివృద్ధి పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ లోని పెద, మధ్యతరగతి కుటుంబాలకు వారి శుభకార్యాలు,పలుకార్యక్రమాలు జరునెకోవాడానికి నిర్మించిన కమ్యూనిటీ హాల్ ఇప్పుడు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు భారంగా మారిందని, హాల్ లో కనీస సౌకర్యాలు లేవని, కార్యక్రమాలు నిర్వహించేందుకు జిహెచ్ఎంసికి రుసుము చెల్లించినా,బయటనుండి మంచినీటిని కొనుగోలు చేసుకునే భారం పడుతుందని, ఫలితంగా అవసరమైన వసతులను ఏర్పాటు చేసుకునేందుకు ఇబ్బందికరంగా మారిందని, విద్యుత్తు సరఫరా మెరుగుపర్చడానికి వైరింగ్ ను క్రమబద్ధీకరించాలని, బుకింగ్ కొరకు డబ్బులు చెల్లించినా,వసతులను అదనపు ఖర్చులు చేయలసి వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని కార్పొరేటర్ అధికారులకు వివరించారు. ప్రత్యేక దృష్టివహించి, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేసి హాల్ అభివృద్ధి చర్యలకు అధికారులను ఆదేశించాలని కార్పొరేటర్ కోరారు. ముందస్తుగా కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో వెంటనే హాల్‌వద్ద సెక్యూరిటీ గార్డ్‌ను నియమించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే సెక్యూరిటీ గార్డ్ ను నియమించి, అతి త్వరలో కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదించుకోవాలి

పిఎస్ఎన్.మూర్తి

చిక్కడపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: విద్యార్థులు అంతా కలిసి రాజ్యాంగాన్ని కాపాడుకోవడంతో ఇందుకు కావలసిన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని ఇండియన్ డిఫెన్స్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ పూర్వ అధికారి, ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ చీఫ్ అడ్వైజర్ పిఎస్ఎన్.మూర్తి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో "మహిళా సాధికారతే దేశ సాధికారత "అనే అంశం పై సభ జరిగింది. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సి అధ్యక్షతన జరిగిన సభలో పిఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ ప్రస్తుత సమాజం లో ఆలోచనా రహితంగా కుల, మత, వర్గ భేదాలతో మనుషులు ఘర్షణపడుతున్నారని, అంబేద్కర్ చూపించిన దారిలో సమానత్వంతో మనమంతా మెలగాలని, దానికోసం యువతరం హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. అంబేద్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ విష్ణు ప్రియ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ రాజ్యాంగాన్ని చదవాలని, పరిణితితో విద్యను అభ్యసించాలన్నారు. స్త్రీలు కొన్నిరంగాలకు పరిమితంకాకుండా విభిన్న రంగాల్లోనూ సమభాగం సాధించాలన్నారు. గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ మహిళా సాధికారతే దేశ సాధికారతకు ఏకైక మార్గమన్నారు. మహిళల సాధికారతకు బాట వేసిన సావిత్రి బాయి ఫూలే, బాబా సాహెబ్ అంబెడ్కర్ జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్త్రీ సాధికారతకు తోడ్పడే విద్య, వికాసం, విజ్ఞానం పొందాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఫోర్ట్ ఫెలోషిప్ సిద్దోజి రావు, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ అప్పలయ్య, విజయేంద్ర కుమార్, కృష్ణకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు కవిత్వంలో ఆద్యుడు కవి కాశీపతి : జస్టిస్ చంద్రయ్య

నాంపల్లి, జనవరి 27 ప్రభాతవార్త : గద్వాల్ ఆస్థానకవి కవిసింహ పోకూరి కాశీప్రత్యవధానుల 133 జయంతోత్సవం నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని సమావేశమందిరంలో ప్రముఖ వక్తలు తెలుగు కవిత్వం లో ఆద్యుడు కవికాశీపతి అన్నారు. తెలుగు ఏకాక్షరి, ద్విఅక్షరి, దశాక్షరి తదితర అక్షర కవిత్వానికి చిత్ర కవిత్వానికి కాశీపతిని మించినవారు లేరని, కాఫీదండకాన్ని వందసంవత్సరాలు ముందే ఆయన అందించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ గుండా చంద్రయ్య పాల్గొని కవిసింహ పోకూరి కాశీపతి పీఠం వ్యవస్థాపకులు గార్లపాటి గురుబ్రహ్మచార్యులు ప్రచురణకార్తగా సంపాదకులు పి.చంద్రప్రకాష్, కె.కనకాచారి, కె.వెంటక గణేష్‌బాబు వ్యవహరించి కాశీపతి అవధానులు శ్రీశౌరి శైశవలీల గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వేముల గౌరీ శంకర్, కార్యదర్శి బెజ్జంకి జగన్నాధచార్యులు, సమన్వయకర్త బిట్టు వెంకటేశ్వర్లు ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్య గౌరీశంకర్, వెంకటేశ్వర్లు ప్రముఖ కవులు రాధాశ్రీ, చింతా రామకృష్ణ, రత్నశర్మలను ఘనంగా సత్కరించారు. అనంతరం కవిసమ్మేళనం నిర్వహించి పాల్గొన్న 35మంది కవులను ఘనంగా సన్మానించారు.

బాలకృష్ణ సేవలు కేంద్ర ప్రభుత్వం గుర్తించటం అభినందనీయం

ముషీరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: నటుడిగా దాదాపు 50 సంవత్సరాలుగా తెలుగు చలన చిత్రపరిశ్రమకు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ ఛైర్మన్‌గా పేద రోగులకు ఎనలేని సేవలు అందిస్తూ, మూడుసార్లు హిందూపురం శాసనసభ్యునిగా ప్రజాభిమానంతో హ్యాట్రిక్ సాధించిన నందమూరి బాలకృష్ణ సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఆయనకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించటం అభినందనీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కొనియాడారు. సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ నేతలు బాలకృష్ణను కలిసి, శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ తండ్రి ప్రమేయం లేకుండా స్వశక్తితో ఎదిగిన బాలకృష్ణ, ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకున్నారని,

బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ నేతలు

అటువంటి బాలకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, శ్యాంసుందర్, ప్రమీల, చంద్రమోహన్, భానుప్రకాష్, సత్యనారాయణ, కిరణ్, వీరబాబు, జి.అనిల్‌కురుమ పాల్గొన్నారు.

అమరణ నిరాహార దీక్ష విరమిస్తున్న ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త

బోనాల శ్రీనివాస్‌గుప్త అమరణ నిరాహారదీక్ష విరమణ

అప్జల్‌గంజ్, జనవరి 27 ప్రభాతవార్త: పొట్టి శ్రీరాములు యూనివర్సిటి పేరును యధావిధిగా కొనసాగించాలని కోరుతూ అమరణ నిరాహారదీక్ష చేపట్టిన ప్రజా ఏక్తా జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త సోమవారం అప్జల్‌గంజ్ పోలీసులు, ఒంగోలు జిల్లా పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం అధ్యక్షులు నాగ అంజయేయులు నిమ్మరసం ఇచ్చి దీక్షాను విరమింప చేశారు. పోటిశ్రీరాములు యూనివర్సిటి కొనసాగించాలని డిమాండ్ చేస్తు ఈనెల 26వ తేదిన జాతీయ జెండాను ఎగురవేసి అమరణ నిరాహార దీక్షా చేపట్టిన విషయంవిధితమే ఈ సందర్భంగా బోనాల శ్రీనివాస్‌గుప్త చేపట్టిన అమరణ నిరాహదీక్షకు నాగేంద్రకుమార్, పి.తిరుమలగుప్త, గోషామహాల్ నియోజకవర్గంకు చెందిన నాయకులు ఎం.కె.నరేందర్, శ్రీనివాస్, డాక్టర్ నాగేష్ తదితరులు తరలి వచ్చి మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి మూలంగాఉన్న యూనివర్సిటికి పేరును తొలగించడం పట్ల తీవ్రంగా వ్యతిరేకించారు.తనకు మద్దతు పలికిన ప్రతి ఒకరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తానన్నారు.

వెయ్యి గొంతులు, లక్ష డప్పులు దండోరా

వెయ్యి గొంతులు ..లక్షడప్పులు విజయవంతం చేయాలంటూ దండోరా

బేగంబజార్, జనవరి 27 ప్రభాతవార్త: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు స్వామి వివేకనందనగర్ హరిజనబస్తీలోని అంబేద్కర్, జగ్జజీవన్‌రామ్, వివేకానంద విగ్రహాల ముందు చార్మినార్ నియోజకవర్గం అధ్యక్షుడు చెన్నపాక యాదగిరిమాదిగ ఆధ్వర్యంలో వెయ్యిగొంతులు, లక్షడప్పుల కార్యక్రమాన్ని నిర్వహించి దండోరా వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి ఎబిసిడి వర్గీకరణ సాధనకు అలుపు ఎరగని పోరాటం మంద కృష్ణమాదిగ చేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 1వ తేదిన దేశంలోని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ధర్మసనాం ఏడుమందితో కూడిన బెంచ్‌లోని ఆరుమంది ఎబిసిడికి అనుకూలంగా తీర్పు చెప్పడం జరిగిందన్నారు. అది జీర్ణించుకోలేని మాలల్లోని కొంతమంది వర్గీకరణకు అడ్డుపడుతున్నట్లు చెప్పారు. వచ్చేనెల 7వ తేదిన చేపట్టిన వెయ్యిగొంతులు, లక్షడప్పుల దండోరా విజయవంతం చేయాలన్నారు.ఈకార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం పర్యవేక్షకులు సి.కృష్ణ, నర్సింహస్వామిమాదిగ, పురానాపూల్ డివిజన్ ఇన్‌చార్జ్ ఊదరి నందకుమార్‌మాదిగ, సంఘం అధ్యక్షులు ఎం.పి సదానంద్, మహిళా అధ్యక్షురాలు బేబిరాణి, మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యక్షులు కె.ఎం.గురుచరణ్, ప్రధాన కార్యదర్శి మాదిగ ప్రభాకర్, యువజన అధ్యక్షులు పి.మహేందర్, బాబు, పి.రామ్‌దాస్, జ్ఞాన్, బాల్‌రాజ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల భూమి కాజేసేందుకు కుట్ర

డిజిపికి ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడలో మాజీ సైనికుల కోసం సర్కారు కేటాయించిన భూములను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వీరి నుంచి తమకు రక్షణ కావాలని అజిత్ రాజ్‌కుమార్ అనే వ్యక్తి డిజిపి జితేందర్‌కు ఫిర్యాదు చేశాడు. దమ్మాయిగూడెంలో 1964లో అప్పటి ప్రభుత్వం మాజీ సైనికులకు వంద ఎకరాలకు పైగా భూమిని వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించిందని, ఈ భూమిలో అప్పటినుంచి మాజీ సైనికులు, వారి వారసులు సాగుచేసుకుంటున్నారని అజిత్ రాజ్‌కుమార్ తెలిపాడు. ఇందులో తన తాత బట్టు జాన్ బెన్నికి 15 ఎకరాల పొలం కేటాయించారని, ఇందులో చాలా వరకు కబ్జాకు గురైందని, తన కుటుంబానికి కేవలం 1.4 ఎకరాలు మాత్రమే మిగిలిందని, ఈ స్థలంలో ఫెన్సింగ్ వేయగా స్థానికుడైన తూటి రాంచందర్ అతని అనుచరులు ఫెన్సింగ్‌ను బలవంతంగా తొలగించి కబ్జాకు యత్నించాడని అతను డిజిపికి ఫిర్యాదు చేశాడు. ఏడేళ్లుగా తమ భూమిపై కొందరు పలుమార్లు దౌర్జన్యం చేయడ ంతో పాటు కబ్జాకు యత్నించారని అతను తెలిపాడు. తాజాగా ఈ నెల 20వ తేదీన రాంచందర్ మరోసారి కబ్జాకు యత్నించాడని, తనతో పాటు కుటుంబ సభ్యులను చంపుతానని రాంచందర్ బెదిరించాడని అజిత్ కుమార్ తెలిపాడు. దీనిపై జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఈ విషయంలో రాంచందర్‌తో పాటు అతని అనుచరులు, గతంలో తమ స్థలాన్ని కాజేసేందుకు యత్నించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అతను కోరాడు. ఈ ప్రాంతాంలో మరి కొందరు మాజీ సైనికుల భూములను కూడా భూకబ్జాదారులు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, కోట్ల రూపాయల ఈ భూములను కబ్జారాయుళ్ల పాలు కాకుండా పోలీసు శాఖ కఠినంగా వ్యవ హరించి, గుండాల నుంచి తమకు రక్షణ కల్పించాలని రాజ్‌కుమార్ కోరాడు.

బేకు శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్, ఎక్స్‌లెన్స్ అవార్డు

పేట్‌బషీరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: సామాజిక కార్యకర్త, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం 132 డివిజన్‌కు చెందిన బేకు శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్‌తోపాటు డా.బి.ఆర్ అంబేద్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించారు. ఈ నెల 25వ తేదీన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్శిటీ హోసూరు శ్రీనివాస్ చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు ఈ అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు.తమిళనాడు హోసూరులో జరిగిన కార్యక్రమంలో బేకు శ్రీనివాస్ తో పాటు ఆలిండియా దళితసంఘం అధ్యక్షులు డా అవిజే జేమ్స్,ప్రముఖ సంఘసేవకులు గొరిగే బాలప్ప,పెసర కాయల మహిపాల్‌రెడ్డి,అంగరాజు పుల్లంరాజు హైదరాబాద్ నుంచి ఆ కార్యక్రమానికి తరలి వెళ్లారు.బేకు శ్రీనివాస్ కు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం పట్ల సామాజిక కార్యకర్తలు,మేధావులు ఇతర రంగాలకు చెందిన వారు హర్షం వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా బేకు శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు గౌరవ డాక్టరేట్‌తో పాటు బీఆర్ అంబేద్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందించడం ఎంతో ఆనందానికి గురి చేసిందన్నారు.వారికి తన తరుపున హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.

యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని ఫణి భార్గవ్ యాదిలో...

చిక్కడపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: బాధలో ఉన్న వారిని బాధ నుంచి విముక్తి చేయడానికి ఇటువంటి మంచి కార్యక్రమాలు ఎంతో ఓదార్పును అందిస్తాయని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం రాత్రి కళానిలయం, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని ఫణి భార్గవ్ యాదిలో....వివిధ రంగాలకు చెందిన వారికి నగదు పురస్కారాలను అందించే కార్యక్రమం గానసభలోని కళాసుబ్బారావు కళా వేదికలో జరిగింది. సుందరయ్య విజ్ఞానకేంద్రం మేనేజింగ్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్‌కు ఆత్మీయంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి హాజరు కాగా సభకు రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎం.కె.రాము అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, గానసభ అధ్యక్షులు కళావిఎస్.జనార్దనమూర్తి, నేటినిజం పత్రిక ఎడిటర్ బైసాదేవదాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగదు పురస్కారాలను సీనియర్ పాత్రికేయులు గండ్ర నవీన్, పి.రాధిక, పి.జ్యోతిలకు అందించి సత్కరించారు. సమాజాన్ని ప్రభావితం చేస్తున్నవారిని సత్కరించడం అభినందనీయమని మధుసూదనాచారి అన్నారు. సంస్కారవంతమైన కార్యక్రమాల నిర్వహించడం ద్వారా సమా జాన్ని ప్రభావింతం చేసినట్లు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి ఎ.సురేందర్, ఫణిభార్గవ్ తండ్రి, ప్రముఖ పాత్రికయులు రాయప్రోలు రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్యగురువు, కురుగంటి కళాక్షేత్రం రాధిక, నృత్యగురువు తులసి శిష్యబృందం నిర్వహించిన నృత్యాలు, వేమూరి మంజుల నిర్వహించిన లలితగీతాలాపన, కొండలరావు బృందం నిర్వహించిన పాటల కార్యక్రమం అందరిని అలరించింది.

31న రవీంద్రభారతిలో గద్దర్ జయంతి సభ

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త:

ఈనెల 31న రవీంద్రభారతిలో ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వం-గద్దర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గద్దర్‌కుమారుడు సూర్యకిరణ్ తెలిపారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జయంతిసభ పోస్టర్‌ను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్, ప్రెస్‌అకాడామీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, దర్శకుడు ఎన్.శంకర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, సామాజిక వేత్తలు పాల్గొన్నారు.

బాలాపూర్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు పూర్తి స్థాయి డాక్టర్‌ను నియమించాలి

సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త:

హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు రెగ్యులర్ డాక్టర్‌ను నియమించి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ప్రతినిధి బృందం సోమవారం రంగారెడ్డి జిల్లా మెడికల్ ఆఫీసర్(డిఎంఅండ్‌హెచ్‌ఓ)ను కోరింది. ఈ మేరకు వారు డిఎంఅండ్‌హెచ్‌ఓను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ లేకపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. డాక్టర్ నియామకం చేసి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి కొల్లూరి భీమేష్, శంకర్, కండ్లపల్లి నరేందర్, మహేష్, మౌలానా, రాంప్రసాద్ పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చి వ్యవహారంలో రాజకీయ జోక్యం వద్దు

సైఫాబాద్, జనవరి 27 ప్రభాతవార్త:

ప్రపంచ ప్రఖ్యాతిగాంచి 20 వేల సంఘాలు, లక్షలాది మంది క్రైస్తవ భక్తులు కలిగి ఉన్న హెబ్రోన్ చర్చి వ్యవహారంలో రాజకీయ జోక్యం తగదని, రాజకీయం చేసు ్తన్న కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు, అతని అనుచరులు మోహన్‌బాబు, ప్రసాద్‌రావులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత క్రిస్టియన్ కౌన్సిల్, దళిత క్రైస్తవ ఐక్య వేదిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి వెంటనే రాజేశ్వర్‌రావు, ఆయన అనుచరులను సస్పెండ్ చేయాలని సంఘాల నాయకులు బిషప్ భాస్కర్ ముల్కాలా, బిషప్ ఆర్.మోజస్, రెవరెండ్ షావల జోసఫ్ కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంత కాలంగా రాజేశ్వర్ రావు, అతని అనుచరులు హెబ్రోన్ చర్చిలో ప్రైవేటు సైన్యాన్ని తీసుకొచ్చి పేద దళిత క్రైస్తవులు సమర్పించే కానుకులను దోచుకునే ప్రయత్నం చేస్తునా ్నరని ఆరోపించారు. రాజేశ్వర్‌రావు పై ఎలాంటి దాడి జరగకపోయినప్పటికి దాడి జరిగిందని తప్పుడు

మాట్లాడుతున్న ముల్కాల భాస్కర్

ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల రాజేశ్వర్‌రావు చిల్లర రౌడి లను, బిజెపి అనుకూల నాయకులు, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపి అరవింద్, డిసిపి, ఎసిపిలతో ఫోన్ చేయించి చర్చి సోసైటీ, ట్రస్ట్ సభ్యులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. హెబ్రోన్ చర్చి రాజకీయా లకు అతీతంగా ఉండాలని, ప్రార్థనలు శాంతి యుతంగా జరగాలని, ఆస్తుల దోపిడీ జరగరాదని వారు ప్రభుత్వాన్ని కోరారు.

హెబ్రోన్ చర్చిని కాపాడాలి...

దేశ విదేశాల్లో కోట్లాది మంది క్రైస్తవ భక్తులు కలిగియున్న హెబ్రోన్ చర్చిని, ఆస్తులను ప్రభుత్వం కాపాడాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జెరుషాలెం మత్తయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్చికిసంబంధించి సోసైటీ, ట్రస్ట్ సభ్యులు కొన్ని సంవ్సరాలుగా చర్చిని విజయవంతంగా కొనసాగిస్తున్నారని చెప్పారు. కాగా మాజీ ఎమ్మెల్సీ డి.రాజే శ్వర్‌రావు, అతని అనుచరులు ప్రభుత్వంలోని పెద్దల పేర్లు చెప్పి చర్చిలోని డబ్బులు దోచుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని

తెలంగాణలో ప్రతిభకు కొదవ లేదు

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త:

గ్రామీణ తెలంగాణలో ప్రతిభాంతులైన క్రీడాకారులకు కొదవలేదని, సత్తా చాటేందుకు సరైన వేదిక కల్పిస్తే పల్లెల నుంచి ప్రపంచ చాంపియన్లను తయారుచేయగలమని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మెన్ కె. శివసేనా రెడ్డి అన్నారు. మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి సోమవారం దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ) అండర్17 క్రికెట్ టోర్నమెంట్‌ను శివసేనారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడఉతూ ఉమ్మడి జిల్లాల జట్లు టోర్నమెంట్‌లో పోటీపడటం సంతోషకరం. ప్రతిభావంతులైన క్రికెటర్లను ఎంపిక చేసి అమెరికా క్రికెట్ అకాడమీతో మ్యాచులు ఆడించాలనే టీడీసీఏ ఆలోచన అభినందనీయమని దీంతో మన పల్లె క్రికెటర్లకు ప్రపంచ స్థాయి అనుభవం వచ్చేందుకు అవకాశం ఏర్పడనుందని

టోర్నీ ప్రారంభోత్సవంలో శివసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

తెలిపారు. మాజీమంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పోటీపడుతున్న పది జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామీణ క్రికెటర్లకు సరైన అవకాశాలు లభించటం లేదు. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి కోసం బీసీసీఐ నుంచి గుర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మార్చిలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టు మన తెలంగాణ గ్రామీణ క్రికెటర్లతో పోటీపడేందుకు హైదరాబాద్‌కు రానుందని. గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు దక్కేందుకు టీడీసీఏ పోరాటం సాగుతుందని తెలిపారు. పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, టీడీసీఏ జిల్లా కన్వీనర్లు సురేందర్ రెడ్డి, మహ్మద్‌మతీన్, రాఘవరెడ్డి,బాబు, శరత్, సురేశ్, జీవన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జగన్నాథరెడ్డి, రహీమ్ సహా సీనీ నటుడు సర్దార్ క్రికెట్ టోర్నమెంట్ ఆరంభ కార్యక్రమంలో పాల్గొన్నారు

సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ టాలీవుడ్ హీరో మరియు టీమా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మార్చినెలలో రవీంద్రభారతిలో ఆర్టీఐ ఆధ్వర్యంలో జరగబోయే సమాచార హక్కు చట్టం అవగాహనా సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుండి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు అన్నారు. సామాన్యుడికి ఏ కార్యాలయానికి వెళ్లినా, పని చేయించుకోవటం, తనకు కావల్సిన సమాచారాన్ని రాబట్టం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 2005, అక్టోబర్ 12వ తేదీన ఈ సమాచార హక్కు చట్టంను అమల్లోకి తీసుకువచ్చిందని వివరించారు. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ప్రతి భారతపౌరుడు సామాజిక బాధ్యతగా అవినీతి, అక్రమాలను నిరోధించటానికి, పేద ప్రజలకు ఆర్టీఐ ఆవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటిముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియారెడ్డి, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి రాసునూరి లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్, సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి పాల్గొన్నారు.

దేవాలయంలో సొంత నిధులతో బోరు వేయించిన రాజేందర్‌రెడ్డి

నార్సింగి, జనవరి 27 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తన సొంత డబ్బులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వందలాది మంది భక్తులు నిత్యం దేవాలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని, అలాంటి వారికి నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నట్లు నా దృష్టికి వచ్చిందన్నారు. సొంత నిధులతో ఆలయంలో బోరువేయించి ఇబ్బందిని తీర్చాలని నిర్ణయించుకొని, సోమవారం ఆలయ పూజరి ప్రత్యేక పూజల అనంతరం బోరు వేయించడం ప్రారంభించామన్నారు. దేవుడి దయ వలన 500. పీట్లలోనే పెద్ద ఎత్తున నీరు వచ్చిందని, నా చేత తన భక్తులకు నీటి సౌకర్యంను ఆ నర్సిహస్వామి కల్పించుకున్నారని, ఇది నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాజేందర్‌రెడ్డి చేసిన ఈ మంచి పనిని పుర ప్రముఖులు, వయోజనులు, భక్తులు అభినందిస్తున్నారు.

భూ కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త:

నకిలీ పత్రాలు సృష్టించి స్థలాలను అక్రమం గా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఏకశిలానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు జుబేర్ అక్రమ్, రామ్‌రెడ్డి, చెరుకు శివారెడ్డి, ముత్తారెడ్డి తదితరులు మాట్లాడారు. మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం కొర్రెముల గ్రామంలో1985 సంవత్సరంలో వెంచర్ చేయగా వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహించిన తాము ప్లాట్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు.సదరు భూమిపై కన్నేసిన కబ్జాదారులు నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి స్థానిక అధికారులను ప్రలోభాలకు గురిచేసి తమ భూములను వ్యవసాయ భూములుగా చూపుతూ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని చెప్పారు. దీంతో తాము రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తమకు అనుకూలంగా ఆదేశాలు జారీ

ఏకశిలా నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

మాట్లాడతున్న అసోసియేషన్ ప్రతినిధులు

చేసినట్లు చెప్పారు. న్యాయస్థానం ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ తమ స్థలాల్లోకి తమను వెళ్లకుండా గుండాలచే అడ్డుకుంటున్నారని వాపోయారు. పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ అక్కడికి వచ్చారని చెప్పారు. విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా మాట్లాడుతుండడంతో వారించే ప్రయత్నంలోనే ఘర్షణ చోటుచేసుకుందన్నారు. వెయ్యి మందికి పైగా బాధితులు ఉన్న ఈ అంశంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముత్తారెడ్డి శ్రీనివాస్ వెంకటేష్ నిర్మల కళ్యాణి రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

ఇంటిదొంగ అరెస్ట్

రూ.52లక్షలతో ఉడాయించిన ఎలక్ట్రీషియన్.. పట్టుకున్న పోలీసులు

పేట్‌బషీరాబాద్, జనవరి 27 ప్రభాతవార్త : తిన్నింటి వాసాలు లెక్కించే క్రమంలో ఓ ఇంటిదొంగ పోలీసుల చేతచిక్కి కటకటాలపాలయ్యాడు. ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఎలక్ట్రిషీయన్‌గా చేరి, అందులో ఉన్న ఓ ఇంట్లో అన్ని మార్గాలను తెలుసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమమంలో లోనికి ప్రవేశించి అల్మారాలో దాచిన 52లక్షలతో ఉడాయించాడు. చివరకు పోలీసులకు చిక్కి జైలు పాయ్యాడు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పేట్ బషీరాబాద్‌లోని తన కార్యాయలంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మెదక్‌కు చెందిన ఆనంద్ (21) గత కొన్నెళ్ల క్రితం నగరానికి వలస వచ్చి ఎలక్ట్రిషీయన్‌గా పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. దీనిలో భాగంగా కొంపల్లిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఉన్న గేటెడ్ కమ్యూనిలో నివాసం ఉంటున్న వెలగపూడి భవాని శంకర్ తన ఇంట్లో అల్మారాలో ఉన్న 52లక్షల 50వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగిలించారని పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 26వ తేదిన ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు రంగంలోనికి దిగి సీసీ కెమారాల ద్వారా దర్యాప్తు చేపట్టగా అందులో ఎలక్ట్రిషియన్‌గా పనిచేసే మెదక్ ప్రాంతానికి చెందిన ఏ. ఆనంద్‌గా గుర్తించి పోలీసులు అదుపులోనికి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద ఉన్న 43 లక్షల డబ్బులను స్వాదీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీసీసీ కోటిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం,పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయ్ వర్ధన్, డీఐ విజయ్, ఎస్ఐ ధర్మేశ్‌తో పాటు క్రైం పోలీసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చార్మినార్, జనవరి 27 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం...పాతబస్తీ జల్‌పల్లి ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫహాద్ (17) చార్మినార్ సమీపంలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు.ఈ నెల 26వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో ద్వి చక్ర వాహనంపై పహాద్ చాంద్రాయణగుట్ట నుంచి జల్‌పల్లికి వెళుతున్నాడు.టైటాన్ ఫంక్షన్ హాల్ రహదారి మీదుగా మహ్మద్ పహాద్ ద్వి చక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్నాడు.అదే సమయంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వచ్చి ఫహాద్ ప్రయాణం చేస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది.తీవ్ర గాయాలపాలైప ఫహాద్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.ఈ కేసును బండ్లగూడ పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, జనవరి 27 ప్రభాతవార్త:

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు సిఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలా చేయూత నందిస్తు నా ్నరని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. తిరుమలగిరి మండలంలోని 96 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం లాల్‌బజార్‌లో వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి తహశీల్దార్ అశోక్ కుమార్, కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, రంగ రవిందర్ గుప్త, మురళీ ముదిరాజ్, సంకి రవిందర్, తాటి కాయల యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు శ్రీ కాళీ మాత మందిరం ఉత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 25 ప్రభాతవార్త : హైదరాబాద్ బెంగాలీ స్వర్ణ శిల్పి వివేకానంద కాలీ మాత మందిరం ఐదవ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయని మందిరం కమిటి ప్రధాన కార్యదర్శి బరుణ్ రాణా తెలిపారు. ఘాన్సీ బజార్‌లో ఆయన మాట్లాడుతూ నరకూడలోని కాళీ మాత మందిరంలో ఈ నెల 28,29,30 తేదీలలో మూడు రోజుల పాటు మందిరం ఐదవ వార్షి కోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయని ఆయన తెలియజేశారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సౌభ్యసాచి ఘోష్‌లుమందిరంలో 25వ తేదీన పూజలు నిర్వహించారని ఆయన వెల్లడించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT SECUNDERABAD
O.S. No. 794 of 2024

BETWEEN:
Aruru Srinivasulu & another ...Plaintiffs
AND
The Tahasildar, Musheerabad Mandal & others ...Defendants
To,
All concerned

Whereas plaintiffs have instituted a suit against Tahsildar Musheerabad Mandal & others to declare the plaintiffs as legal heir of deceased **Smt. Aruru Lakshmi.** If any person/s having any right, claim or objection of whatsoever nature are hereby summoned to appear in this Hon'ble court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit and further you all concerned are hereby directed to file written statement of your defence and to produce all documents in your possession or power upon which you base your defence before the Hon'ble court on the **05-02-2025 at 10.30 'O' clocks.**
TAKE summons that in default of your appearance and to file your written statement on above date the suit will be heard and determined ex-parte in your absence.

By order of the court
Sd/- Smt. G. PRASANNA
Advocate
Phone: 7659058516

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT SECUNDERABAD
O.S No. 143 of 2016

Between
Smt. A. Usha Reddy W/o A. Anil Reddy, Aged about 62 Years, Occ: Housewife, Rep by her GPA Holder A. Anil Reddy S/o A. Balakrishna Reddy, Aged 67 Years, Occ: Partner in M/s Auto Coach Builders Both R/o H. No. 8-2-293/82/A/936/1, Road No 47, Jubilee Hills, Hyderabad-500 033 ...Plaintiff
AND
1. M/s Aluminium India A Partnership Firm, Having its Firm at H. No. 4-3-41, Hill Street, Secunderabad- 500 003 Rep by its Partner Sri Niranjan Vyas and Suresh Vyas
2. Mr Niranjan Vyas S/o Chirangi Vyas, Aged Major Occ: Partner of M/s Aluminium India, R/o H. No. 4-3-41, Hill Street, Secunderabad- 500 003
3. Mr Suresh Vyas S/o Chirangi Vyas, Aged Major Occ: Partner of M/s Aluminium India, R/o H. No. 4-3-41, Hill Street, Secunderabad- 500 003
4. Mr Karthik Vyas S/o Late Sri Baiju Vyas, Aged Major Occ: Partner of M/s Aluminium India, R/o H. No. 4-3-41, Hill Street, Secunderabad- 500 003 ...Defendants

Whereas the above-named Plaintiff has filed the above Suit O.S No. 143 of 2016 on the file of the Hon'ble I Additional Chief Judge, City Civil Court, Secunderabad against the Defendants, seeking a relief of Recovery of Amounts. The Honorable Court has posted the Matter to **11.02.2025** for objections, if any. If any person or persons have any claim/objection in respect of grant of relief of Recovery in favor of the Plaintiff, they are hereby required to appear before Hon'ble I Additional Chief Judge, City Civil Court, Secunderabad on **11.02.2025 at 10.30 AM** with supporting documents, if any, as otherwise the Court would proceed to grant the relief as prayed for.
(Issued Under The Orders of the Court)
Sd/- P. SUMITRA, Advocate
2nd Floor, 3-6-369/A/18, SVSKL Mansion, Street No.1, Himayatnagar, Hyderabad-29

**BEFORE THE HON'BL

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకురాలు అంబిక

గణిత మేధాశక్తికి అబాకస్ తోడ్పడుతుంది : అంబిక

మలక్‌పేట ,జనవరి 27, ప్రభాతవార్త: గణిత మేధో శక్తికి అబాకస్ ఎంతో తోడ్పడుతుందని ఎస్ఐపి అబాకస్ మారేడుపల్లి నిర్వాహకురాలు అంబిక పేర్కొన్నారు. ఎస్ ఐ పి అబాకస్ మారేడ్ పల్లి నిర్వాహకురాలు అంబిక ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి భవన్ లో నిర్వహించిన జోనల్ ప్రాడజీ, వార్షికోత్సవ వేడుకలు, గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అబాకస్ తో విద్యార్థులలో ఏకాగ్రత, మేధోశక్తి పెంపొందుతుందని తెలిపారు. ఎస్ ఐ పి అబాకస్ మారేడ్ పల్లిలో 11 విభాగాలలో విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేయడం జరిగింది పేర్కొన్నారు. ప్రాడజీ విభాగంలో 6 మంది విద్యార్థులు ఛాంపియన్ అవార్డులు సాధించగా, 39 విద్యార్థులు మొదటి రన్నర్స్ గా, 58 విద్యార్థులు రెండవ రన్నర్స్ గా, 25 మంది విద్యార్థులు మూడవ రన్నర్స్ గా నిలిచారని వివరించారు. తమ సంస్థకు చెందిన విద్యార్థులు 90 మార్కులు సాధించారని తెలిపారు. అబాకస్ తో లెక్కల్లో ప్రావీణ్యం సంపాదించడంతోపాటు జాపకశక్తి, వినికిడి శక్తి పెరుగుతుందన్నారు. అర్థమెటిక్ నైపుణ్యాలు పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. కిరణ్, శ్రావణి, ప్రవల్లిక,శ్రీలేఖ అర్చన తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం అదనపు అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం. జనవరి.27.ప్రభాతవార్త. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం అదనపు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంక్షేమ సంఘం ప్రతినిధులు ,తెలంగాణ సీని యర్ సిటిజన్స్ నాయకులు సోమవారం మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అం దుకు సానుకూలంగా స్పందించిన ఈటెల నిధులు మంజూరు చేస్తామన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాలనీ అధ్యక్షుడు పి.గోపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,ప్రసాద్, కోశాధికారి చిన్నా యాదవ్,జి.ప్రభాకర్ రెడ్డి. సీనియర్ సిటీజేన్స్ ప్రతిని ధులు జనగామ కృష్ణారెడ్డి, శ్రీ రాములు నేత తదితరులు ఉన్నారు.

ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసపురం ప్రతినిధులు

నేడు రంగారెడ్డి జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

జనవరి27, ప్రభాత వార్త: రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులకు (85 కిలోల లోపు) రంగారెడ్డి జిల్లా జట్టు ఎంపిక నేడు (28వ తేది,మంగళవారం) సరూర్ నగర్ లోని ఇండోర్ స్టేడియం లో నిర్వహించబడునని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపిక అయిన క్రీడాకారులు తేదీ: 04022025నుండి 07022025వరకు డైట్ కళాశాల అదిలాబాద్ జిల్లాయందు నిర్వహించబడు 71వ సీనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. ఇట్టి రంగారెడ్డి జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలలో పాల్గొనాల్సిందిగా వారు కోరారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్ కార్డు తీసికురాగలరని తెలిపారు. ఇతర వివరాలకు చంద్రమోహన్ 766199 2581, రాజు, 9000038272 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మాజ్దూర్ మహా సంఘ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా సమ్మయ్య,శ్రీధర్ రెడ్డి

సమావేశంలో పాల్గొన్న సమ్మయ్య,శ్రీధర్ రెడ్డి తదితరులు

వనస్థలిపురం. జనవరి.27.ప్రభాతవార్త. భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మాజ్దూర్ మహా సంఘ్ అధ్యక్షుడు గా సమ్మయ్య,ప్రధాన కార్యదర్శి గా కె.శ్రీధర్ రెడ్డి.లు నియమితులయ్యారు. మధ్య ప్రదేశ్ భోఫాల్ లొ ఈనెల 25,26 తేదీ లలో జాతీయ అధ్యక్షుడు ఆశిం దత్త ఆధ్వర్యంలో జరిగిన భారతీయ ప్రైవేట్ ట్రాన్ పోర్ట్ మాజ్దూర్ మహా సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ అల్లూరి ప్రకటించారు. ఈ సమావేశానికి తెలంగాణ నుండి 5 సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమ్మయ్య,శ్రీధర్ రెడ్డి లు మాట్లాడుతూ ఏప్రిల్ 12,13 తేదీలలో హైదరాబాద్ బి.పి.టి.ఎం. అఖిల భారత మహా సభలు జరుగానున్నాయని,ఈ సభలను జయప్రదం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఆర్టిఓ

అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆర్టీఓ లెక్కల కిష్టయ్య, ఎంవిఐ రమేష్ బాబు తదితరులు

మలక్ పేట ,జనవరి 27, ప్రభాతవార్త: వాహనదారులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాలని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలని పురస్కరించుకొని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య ఆధ్వర్యంలో ముసారాంబాగ్ లో ర్యాలీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నియమ, నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమనిస్తాలకు చేరుకోవాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టులు ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని కోరారు. ఎంవిఐ లు రమేష్ బాబు, బలరాం, రాధిక, నరేంద్ర పాల్ సింగ్, ఏఎంవి ఐ లు రజిని, మధుసూదన్ రెడ్డి, జాన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ప్రవీణ్ కుమార్, అంజుమ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనం సీజ్

ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త : మూడు రాష్ట్రాలకు చెందిన నెంబర్ ప్లేట్లు పెట్టుకుని తిరుగుతున్న ఒక వాహనాన్ని రవాణాశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నెంబర్ ప్లేట్లు ధరించి వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్న వాహనాన్ని ఉప్పల్ ఎంవిఐ రవీందర్‌రెడ్డి, ఎఎంవిఐ కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వాహనాన్ని పరిశీలించగా నకిలీ నెంబర్ ప్లేట్లు ధరించినట్లు గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి నాగోల్ డ్రైవింగ్ ట్రాక్‌లో ఉంచినట్లు తెలిపారు. వాహనాల పన్నులు తప్పించుకునేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడ్డారని తెలిపారు.

మూడు నెంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాన్ని పట్టుకున్న ఎంవిఐ రవీందర్‌రెడ్డి తదితరులు

అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పది

మాజీ ఎమ్మెల్యే శ్రీ రాం భద్రయ్య

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీ రాంభద్రయ్య, చిత్రంలో డాక్టర్ సతీష్ తదితరులు

మలక్ పేట,జనవరి 27, ప్రభాతవార్త : అనేదానం గొప్పదని మాజీ ఎమ్మెల్యే శ్రీ రామ్ భద్రయ్య పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లోని శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే శ్రీ రామ్ భద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు . రక్తదానం చేయడంతో ఎంతోమంది విలువైన ప్రాణాలను కాపాడిన వారం అవుతామని తెలిపారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన ఆస్పత్రి నిర్వహకులు డాక్టర్ సతీష్ ని ఆయన సందర్భంగా అభినందించారు. నిర్వాహకులు డాక్టర్ సతీష్ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ రంగారెడ్డి జిల్లా శాఖ కు అందజేయడం జరిగింది పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు ఇందిరా, దాసరి జయప్రకాష్, సుఖేష్, అభిలాష్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ పాండు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణలో రాజీ వద్దు

కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 27 ప్రభాతవార్త: ప్రజారోగ్య సంరక్షణలో రాజీ పడవద్దని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. క్రాంతినగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత కొద్ది రోజులుగా డాక్టర్ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సమస్యను కార్పొరేటర్ అరుణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో నూతన డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఫాతిమాను సోమవారంనకార్పొరేటర్ సన్మా నించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ఉచితంగా మందులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ సునిత, కాంపౌండర్ బాబు, బస్తీవాసులు జగన్నాథం, కోళ్ల గోపి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఫాతిమను సన్మానిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

ధర్మరక్షణలో గోసేవ అతి ముఖ్యం

కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడి

సైదాబాద్, జనవరి 27 ప్రభాతవార్త: ధర్మరక్షణలో గోసేవ అతి ముఖ్యమైనదని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. గోబర్, గోమూత్ర, గోదుగ్ధ(జి.జి.జి) ఆధారిత మొదటి విక్రయ కేంద్రాన్ని సైదాబాద్ డివిజన్ వి.కె.డాగే నగర్‌లో ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ గో ఆధారిత ఉత్పత్తులను ప్రతి ఒక్కరు ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. సకల దేవతా స్వరూపమైన గోవును సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శంతన్ కుమార్, శ్యామ్ సుందర్, సురేష్‌బాబు, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కొత్తకాపు అరుణకు మెమెంటో బహుకరిస్తున్న నిర్వాహకుల

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో టీన్ షెడ్డు ప్రారంభం

సైదాబాద్, జనవరి 27 ప్రభాతవార్త: కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ అవరణలోని నవగ్రహ మంటపం నుంచి దుర్గామాత దేవాలయం వరకు దాతల సహకారంతో నిర్మించిన టీన్ షెడ్డును దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య సోమవారం దాతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి లావణ్య మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధిలో భాగస్వాములైన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి దేవాలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇఓ కోరారు. ఈ కార్యక్రమంలో టీన్ షెడ్డు దాతలు రాజులపాటి శ్రీనివాస్, దంటపల్లి వెంకట్‌రెడ్డి, గుజ్జ జైవీర్‌రెడ్డి, బొల్లంపల్లి మనోహర్, పానెం శ్రీనివాస్ గౌడ్, బబ్బూరి ఆనంద్‌గౌడ్, గోపు కృష్ణ ప్రదీప్, మాజీ ధర్మకర్తలు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీన్ షెడ్డును ప్రారంభిస్తున్న దేవాలయ కార్యనిర్వాహణాధికారి లావణ్య

క్రీడాకారులకు ప్రభుత్వం చేయూత : ఎం.పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త : క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి తగు చేయూత అందిస్తామని ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిఆర్ క్రికెట్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన క్రీడా పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన అసిఫ్ టీమ్, సిద్దిక్ టీమ్‌లు విజయం సాధించినట్లు తెలిపారు. వీరికి రూ.15, ఏడు వేలు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా టోర్నమెంట్ నిర్వహించిన రఫీక్, సందీప్‌లను అభినందించారు. క్రీడాకారులకు చైతన్యవంతులను చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులు మరిన్ని క్రీడా పోటీలలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి తౌఫిక్, జిమ్ సందీప్, అకారపు అరుణ్, ఉదయ్‌భాస్కర్, వజీర్‌బాబా, బుల్లెట్ అశోక్, సంధ్యారాణి, గాయత్రి, ఆదినారాయణగౌడ్, పూస సత్తయ్య, మహ్మద్ అతిక్, సురేష్‌యాదవ్, మిట్టుగౌడ్, హరీష్‌గౌడ్, షకీల్, షబ్బీర్, నయిమ్, వాసు, చిన్న సూరి, మధు, నాని, జాను, బన్నీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ పిస్తా హౌజ్‌కు పోలీసుల నోటీసులు

అగ్ని ప్రమాదం జరిగిన పిస్తా హౌజ్‌ను సందర్శించిన సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఎస్ఐ మాధవరెడ్డి తదితరులు

ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త : ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న ఫిస్తా హౌజ్‌లో అగ్నిప్రమాద ఘటనపై వివరణ ఇవ్వాలని ఉప్పల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న పిస్తా హౌజ్‌లో ఆదివారం మధ్యాహ్నం వంట గదిలో అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. భారీ ఎత్తున పొగలు వ్యాప్తించి కస్టమర్లు ఉరకులు, పరుగులు పెట్టారు. దీంతో నిర్వహకులకు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదు. సంఘటనపై స్పందించిన సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఎస్ఐ మాధవరెడ్డి ప్రమాదం సంభవించిన పిస్తా హౌజ్‌ను సందర్శించి అగ్ని ప్రమాదం ఘటనపై వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖతోపాటు, విద్యుత్ శాఖ అధికారులకు నుంచి కూడా వివరణ తీసుకుంటున్నామని తెలిపారు. నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించేపై కఠినంగా వ్యవహరిస్తామని సిఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు.

విజయ్‌కుమార్‌గౌడ్‌కి డాక్టరేట్ ప్రదానం

ఎల్.బి.నగర్, జనవరి 27 ప్రభాతవార్త: నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్న విజయ్‌కుమార్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ దక్కింది. నాగోల్ సుప్రజ హాస్పిటల్స్ ఎండీ శిగ విజయ్‌కుమార్‌గౌడ్ సేవలను గుర్తిస్తూ కెనడాకు చెందిన బ్రోమిటోన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌కుమార్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. బ్రోమిటోన్ విశ్వవిద్యాలయ ఇంచార్జి ప్రతినిధులు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ శివప్ప, డాక్టర్ సురేష్‌గుప్తాలు విజయ్‌కుమార్‌గౌడ్‌కి డాక్టరేట్ పట్టాని అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. యాదాద్రి జిల్లా మూటకొండూర్ మండలం నాంచారిపేటకు చెందిన విజయ్‌కుమార్‌గౌడ్ ఉన్నత చదువులు చదివి చేసిన పలు సేవలు, ఆపదలో ఉన్న నిరు పేదలకు ఆపన్నహస్తం అందిస్తూ, విద్యార్థులకు చేయూతనందించడం, వృద్ధులకు ఆసరాగా నిలవడం, పేదలకు, గీత కార్మికులకు ఉచిత వైద్యం అందించడం, కార్మికులకు రాయితీ వైద్యం తదితర అంశాలను విశ్వవిద్యాలయ బృందం 3 నెలల క్రితం హైదరాబాద్‌కి వచ్చి వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో విజయ్‌కుమార్‌గౌడ్‌కి గౌరవ డాక్టరేట్ అందించాలని ఎంపిక చేశారు. పేదల కోసం విజయ్‌కుమార్‌గౌడ్ చేస్తున్న పనితీరు అభినందనీయమని నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ గ్రహీత విజయకుమార్‌గౌడ్ మాట్లాడుతూ అవార్డులు ఆభరణం కాదని మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. ఈ అవార్డు అందించినందుకు విశ్వవిద్యాలయ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తోటివారికి సాయమందించడమే తన లక్ష్యమన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్నారు. ఈ అవార్డు నాలో మరింత స్ఫూర్తిని పెంపొందించింది అన్నారు.

విజయ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రధానం చేస్తున్న శివప్ప, సురేష్

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ఎల్.బి.నగర్, జనవరి 27 ప్రభాతవార్త: పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని నారాయణ పాఠశాల డిఎం గోపాల్ రెడ్డి, సిఓ మదనా చారి పేర్కొన్నారు. నారాయణ సీఈవో పాఠశాల విద్యార్థి ఎం.కుషాల్‌గౌడ్ తెలంగాణ నుంచి హ్యాండ్ బాల్ టీం నుంచి జాతీయస్థాయి ఫైనల్స్‌కు ఎంపికై ప్రథమ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా కుశాల్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించి సర్టిఫికెట్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షబ్బీర్‌అలీ పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుషాల్‌గౌడ్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న గోపాల్‌రెడ్డి, మదనాచారి

ఉత్తమ సేవాలాంబించిన ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్.బి.నగర్, జనవరి 27 ప్రభాతవార్త: విద్యా రంగంలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం మాజీ అధ్యక్షుడు ఎస్.కె. జాఫర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించిన పూర్వ ఉపాధ్యాయులను మాజీ కార్పొరేటర్ జిన్నారం విటల్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గట్టు శ్రీను, రమణరెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు పవన్‌కుమార్, చైతన్య కాలనీ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, కాలనీవాసులు చెన్నయ్య, సునీత, సంపూర్ణ,లలిత, దుర్గా, ఇంద్ర, సరస్వతి పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయుని సన్మానిస్తున్న విఠల్‌రెడ్డి, జాఫర్

ఘనంగా అగాపే చర్చ్ వార్షికోత్సవం

ఎల్.బి.నగర్, జనవరి 27 ప్రభాతవార్త: కొత్తపేట డివిజన్ శ్రీ శంకర్ కాలనీలో అగాపే బాప్టిస్ట్ చర్చ్ 34 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ శంకర్ కాలనీ అగాపే బాప్టిస్ట్ చర్చ్ 34 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం శుభ సూచకమని, నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చర్చ్ అధ్యక్షుడు ఈవ ఆనందం, సెక్రటరీ శ్రీనివాస్, పాస్టర్ డేంజనాన్, జోసెఫ్, కాలనీ వాసులు రమేష్ చారి, నాయకులు మంచి రాజేష్, వగ్గుల సత్యనారాయణ, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవంలో పాల్గొన్న పవన్‌కుమార్

ఉప్పల్‌లో పద్మశాలి సంఘం నేతల ర్యాలీ

ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త : చిలుకానగర్, బీరప్పగడ్డ పద్మశాలి కులస్థుల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మార్కండేయ జయంతి సందర్భంగా పద్మశాలి కులస్థులు ర్యాలీ నిర్వహిస్తున్నారని, కుల సంఘాల నేతలు ఐక్యంగా ఉండి తమ సమస్యలు సాధించుకోవాలని సూచించారు. ఉప్పల్ రామాలయం నుంచి మార్కండేయ దేవాలయం వరకు చైతన్యయాత్ర నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పి.నాగరాజు, సామల కృష్ణ, రాజేందర్, నాగరాజు, సకినాల ప్రసాద్, శ్రీనివాస్, బాలచందర్, రేణుకా, చంద్రిక, మహేందర్, నరేష్, లోకనాథం,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

డ్రైనేజీ లీకేజీ సమస్య పరిష్కరించండి : ఎర్రం శ్రీనివాస్

రామంతాపూర్, జనవరి 27 ప్రభాతవార్త : రామంతాపూర్ సర్వీస్ రోడ్డు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ రహదారిలో డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌నగర్ నుంచి నాగోల్ మెట్రో స్టేషన్ రహదారిలో డ్రైనేజీ లీకేజీ అవుతుందని, అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రామంతాపూర్ మెట్రో రహదారిలో డ్రైనేజీ లీకేజీ అవుతున్న దృశ్యం.

సమావేశంలో బడంగ్‌పేట్ ప్రగతిని వివరిస్తున్న తాజా మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడి : పక్కన తాజా మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి

బడంగ్‌పేట్‌ను ఐదేళ్లలో రూ.450 కోట్లతో అభివృద్ధి చేశాం : తాజా మాజీ మేయర్ పారిజాత

సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త: గడచిన ఐదేళ్ళ తన పదవీ కాలంలో మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో దాదాపు 450 కోట్లతో అభివృద్ధి చేశామని తాజా మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి వెల్లడించారు. బాలాపూర్‌లోని తన నివాసంలో సోమవారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె గత ఐదేళ్ళలో మేయర్‌గా తాను చేసిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ ప్రగతిని తెలియజేశారు ఇందులో భాగంగా ఏయే నిధులతో ఏమేమి అభివృద్ధి పనులు చేపట్టామో ఆమె కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ కార్పొరేటర్లు, ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైందని ఆమె అన్నారు. తాము ఎన్నికైన కొత్తలో 2020లో కోవిడ్ సంక్షోభం ఆ తర్వాత వరద ముంపు సమస్యలు తలెత్తిన సంగతిని గుర్తు చేస్తూ అట్టి ఆపత్కాల సమయాల్లో తమ వంతుగా వ్యక్తిగతంగా ప్రజలను ఆదుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. తాము అధికారంలో ఉన్న సమయంలోనే బడంగ్‌పేట్ కార్పొరేషన్ స్వచ్ఛ అవార్డు సాధించడం సంతోషానిచ్చిందని ఆమె అన్